సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 13 । జనవరి । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.8,016

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్ రూ.8,016 పలికింది. కనిష్టంగా రూ.7,001, సగటున రూ.7,951గా నమోదైంది.



అవినీతిలో నంబర్ వన్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వ పాలన అవినీతిలో నంబర్‌వన్‌గా ఉందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /15.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశముంది. సాయంత్రం చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యువత సన్మార్గంలో పయనిస్తేనే భవిష్యత్తు



వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో పయనిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ సంగీత అన్నారు. గురువారం యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానందుడి ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, క్రీడలు, యువజన శాఖ అధికారి తిరుపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

బలమే జీవనం.. బలహీనమే మరణం



నివాళులర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: బలమే జీవనం.. బలహీనమే మరణం అని వివేకానందుడు ఇచ్చిన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని బీఈఎంఐఎల్ డైరెక్టర్, బీజేపీ నాయకురాలు బల్మూరి వనిత సూచించారు. వివేకానంద 160 జయంతి సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తాలో వేడుకలు జరిపారు. మహానుభావుల జయంతి, వర్ధంతి జరుపుకోవడమే కా కుండా వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, నాయకులు గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, వడ్డేపల్లి రామచందర్, కోదాటి ప్రవీణ్, తడగొండ నరసయ్య, మంచికట్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి



అలిశెట్టి ప్రభాకర్, స్వామి వివేకానందుడికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జ్యోతినగర్: స్వామి వివేకానంద, అలిశెట్టి ప్రభాకర్ ఆశయసాధనకు పనిచేద్దామని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, పార్టీ సీనియర్ నాయకులు ఎండీ.ఆసిఫ్‌పాషా అన్నారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముచ్చకుర్తి రమేశ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, అలిశెట్టి ప్రభాకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జగిత్యాలకు చెందిన కవి అలిశెట్టి తన సమాజమార్పు కోసం రచనలు చేశారని పేర్కొన్నారు. నాయకులు మురళి గౌడ్, ఉప్పుల సురేశ్, సాయి, పలువురు పాల్గొన్నారు.

జీడీకే–7ఎల్ఈపీ గనిని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



గనివద్ద అడిషనల్ కలెక్టర్

గోదావరిఖని: కోల్‌టూరిజం గనిగా ప్రకటించిన జీడీకే–7ఎల్ఈపీ గనిని గురువారం అడిషనల్ కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ సందర్శించారు. గనిలో పనిస్థలాలను పరిశీలించారు. ఓసీపీ–3లో బ్లాస్టింగ్, మైన్స్ రెస్క్యూస్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, తదితరులున్నారు.

సహకార సంఘం ద్వారా రూ.68.13 కోట్ల వ్యాపారం

మంథని: మంథని సహకార సంఘం ద్వారా ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ధాన్యం సేకరించినట్లు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో మంథని సంఘం పరిధిలోని 34 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3,850 మంది రైతుల నుంచి 3,39,036 క్వింటాళ్ల ధాన్యం కొని సుమారు రూ.68.13 కోట్ల వ్యాపారం చేసినట్లు పేర్కొన్నారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.47.71 కోట్లు జమ చేశామన్నారు.






పండుగకు పోదాం చలోచలో..!

సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు ఐదు రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. తోటి స్నేహితులకు బైబై చెబుతూ.. హాలీడేస్ తరువాత కలుద్దామంటూ తల్లిదండ్రులతో కలిసి వెళ్లిపోయారు. జిల్లాకేంద్రంలోని మహాత్మజ్యోతి భాపూలే గురుకుల హాస్టల్ విద్యార్థులు గురువారం సెలవులకు ఇలా వెళుతూ కనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

అడ్డగోలు కరెంటు బిల్లు..!



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కొమ్మ శ్రీనివాస్. పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామం. రెండునెలలకోసారి వచ్చే బిల్లు కన్నా నెలకే ఎక్కువ వస్తోందంటున్నారు. పైగా అధికారులు అదనపు చార్జీ పేరిట వసూళ్లకు బిల్లు ఇస్తున్నారని వాపోతున్నాడు.



ఏసీడీతో ఇచ్చిన విద్యుత్ బిల్లు

- ఆపై అదనపు చార్జీల పేరిట బాదుడు
- బెంబేలెత్తుతున్న విద్యుత్ వినియోగదారులు

గృహ విద్యుత్ కనెక్షన్లు	228075
వ్యాపార కనెక్షన్లు	225647
పరిశ్రమలు (ఎల్‌టీ)	2018
హెచ్‌టీ	212

వాడకాన్ని బట్టే వసూలు



విద్యుత్ వినియోగం ఏదైనా ఓ నెలలో పెరిగితే అందుకనుగుణంగా డిపాజిట్ మొత్తాన్ని వినియోగదారుడి నుంచి వసూలు చేస్తున్నాం. అది కేవలం డిపాజిట్‌గా మాత్రమే ఉంటుంది. వినియోగదారుడు ఏదైనా కారణంతో బిల్లు కట్టని పరిస్థితుల్లో ఆ డిపాజిట్ నుంచి తీసుకుంటాం. ఇందుకు వినియోగదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

– సుదర్శన్, ఎస్ఈ, ట్రాన్స్‌కో

పెద్దపల్లిరూరల్: కరెంట్‌ను కాదు.. విద్యుత్ అధికారులు ఇచ్చే బిల్లును ముట్టుకుంటేనే షాక్ కొడుతోందని వినియోగదారులు వాపోతున్నారు. అసలే అడ్డగోలుగా కరెంట్ బిల్లులు వస్తున్నాయని బాధపడుతుంటే 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా' ట్రాన్స్‌కో అధికారులు ఏదో ఓ నెలలో విద్యుత్ వినియోగం ఎక్కువైందంటూ ఏసీడీ (అడిషనల్ కన్స్యూమర్ డిపాజిట్) పేరిట వసూలు చేసేందుకు చర్యలు చేపట్టడంపై వినియోగదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వినియోగం తప్పనిసరి అయిన ప్రస్తుత కాలంలో ప్రతి పని చేసేందుకు కరెంట్‌తోనే ముడిపడి ఉండడం.. ట్రాన్స్‌కో అధికారులు బిల్లులను ఏటేటా పెంచడంతోపాటు అపుడప్పుడు ఇలా చార్జీల పేరిట అదనపు వసూళ్లకు పాల్పడుతుండడం వినియోగదారులకు ఇబ్బందిగా మారింది.

బిల్లు చూస్తే గుండె గుభేల్...!

కరెంట్ వాడుకున్న వినియోగదారుడికి పల్లె ప్రాంతాల్లో గతంలో రెండు నెలలకోసారి బిల్లు వచ్చేది. ఇపుడు నెలకోసారి అందిస్తున్నారు. ఆ బిల్లులో వాడకం చార్జీ కన్నా ఎక్కువగా ఇతర అదనపు చార్జీలను కలిపి వసూలు చేస్తున్నారు. ఇవన్నీ ఏంటని సదరు అధికారులను అడిగితే 'అవన్నీ ఏం తెల్వది.. బిల్లులో ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే తీసుకుంటాం.. లేదంటే కనెక్షన్ కట్ చేస్తాం..' అంటున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులను జారీ చేస్తున్న అధికారులు ఆ బిల్లులో దేనికి ఎంత పన్ను వేస్తున్నారు..? ఆ పన్నులను ఎవరికి ఇస్తున్నారనే విషయాలను కూడా చెప్పలేకపోతున్నారని, అయినా వినియోగదారుల నెత్తిన భారం వేస్తున్నారని వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో విద్యుత్ వాడకం దారులంతా ఆందోళనకు గురవుతున్నారని, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఏసీడీ చార్జీల వసూళ్లనైనా నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సుందర నగరంగా మార్చుతాం..!

- ప్రజల్లో చైతన్యం రావాలి • రూ.250 కోట్ల అమృత్ నిధులతో మూడు ఎస్టీపీల నిర్మాణం
- 'సాక్షి' 'ఫోన్‌ఇన్'లో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రజాచైతన్యం అవసరమని మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం 'సాక్షి' నిర్వహించిన 'ఫోన్ ఇన్'లో ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆరువేల కుక్కలకు కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్స చేయించామని, కోతుల సమస్య తీర్చడానికీ చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఓపెన్ కాస్ట్–5తో డంపింగ్ యార్డ్ సమస్య ఏర్పడినందున మరో కొత్త డంపింగ్ యార్డ్‌కు సింగరేణి సంస్థ స్థలం కేటాయించనుందన్నారు. గోదావరిలో మురుగు నీరు కలవకుండా రూ.250కోట్ల అమృత్ నిధులతో మూడు ఎస్టీపీల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని వెల్లడించారు. కోనోకార్పస్ చెట్లతో అనారోగ్యం ఏర్పడుతుందని శాస్త్రీయంగా ఇంకా నిరూపణ కాలేదని, అందుకే వాటిని తొలగించడం లేదని, ప్రమాదాలు జరగకుండా ట్రిమ్మింగ్ చేస్తామని తెలిపారు.

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న: గోదావరి ఒడ్డునున్న హిందూ శ్మశానవాటికలో సమస్యలు తీర్చండి...
– పూర్మ శ్రీనివాస్, జనహిత సంస్థ వ్యవస్థాపకుడు

మేయర్: డంపింగ్ యార్డు కోసం సింగరేణి సంస్థతో చర్చించాం. ఓసీపీ–4 ప్రాంతంలో ఐదెకరాలు ఇచ్చేందుకు అంగీకరించింది. చెత్త రీసైక్లింగ్ సులభతరం చేయడానికి మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం. శ్మశానంలో సౌకర్యాలకు రూ.కోటి వెచ్చించేందుకు కౌన్సిల్‌లో తీర్మానించాం.

ప్రశ్న: నర్రశాలపల్లి, మల్కాపూర్ రోడ్డు నిర్మాణానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..?
– ఎండీ.రహీం, ఐదో డివిజన్ కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శి

మేయర్: రోడ్డు నిర్మాణ పనులు ఎన్టీపీసీ చేపట్టడానికి సిద్ధంగా ఉంది. ముందుగా పైప్‌లైన్ వేయాల్సి ఉంది. పైప్‌లైన్ వేయకుండా స్థానికులే అభ్యంతరం తెలుపుతున్నారు. ప్రజలను ఒప్పిస్తే, పైప్‌లైన్‌తోపాటు రోడ్డు పనులు వెంటనే జరుగుతాయి.

ప్రశ్న: దుర్గానగర్‌లో సీసీ రోడ్డు నిర్మించండి..
– విజయ, దుర్గానగర్

మేయర్: ఇంజినీరింగ్ అధికారులను దుర్గానగర్ ప్రాంతానికి పంపిస్తాం. సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విద్యానగర్ ప్రధాన రోడ్డు పక్కన 20 కుటుంబాల తాగునీటి ఇబ్బందులు తీర్చండి..
– శ్రీనివాస్, విద్యానగర్, 28వ డివిజన్

మేయర్: ఈరోజే రూ.1.50 కోట్ల నిధులతో తాగునీటి సరఫరా పనులకు ఎమ్మెల్యే చందర్ శంకుస్థాపన చేశారు. మీ ప్రాంతంలోని సమస్యను కార్పొరేటర్ పులేందర్ కూడా దృష్టికి తీసుకొచ్చారు. సమస్య అతి త్వరలోనే పరిష్కారం అవుతుంది.

ప్రశ్న: కోనోకార్పస్ చెట్లతో స్ట్రీట్‌లైట్ల వెలుగు కనిపించడం లేదు. ఎందుకు తొలగించడం లేదు..?
– విజయ్‌కుమార్, ఎస్ఎస్‌యూఐ నాయకుడు

మేయర్: కోనోకార్పస్ చెట్లతో అనారోగ్యం ఏర్పడుతుందని శాస్త్రీయంగా ఇంకా నిరూపణ కాలేదు. అందుకే వాటిని తొలగించడం లేదు. ప్రమాదాలు జరగకుండా.. లైటింగ్ వచ్చేలా చెట్లను ట్రిమ్మింగ్ చేయిస్తాం.

ప్రశ్న: 5వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో రోడ్డు, యూజీడీ ఎందుకు చేపట్టడం లేదు..?
– నడిపెల్లి కిషోర్, శ్రీనగర్‌కాలనీ

మేయర్: రూ.కోటిన్నర నిధులతో యూజీడీ ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మీరున్న ప్రాంతంలో అభివృద్ధి జరగకపోతే ఒక లెటర్ ఇవ్వండి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 40వ డివిజన్‌లో అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నాయి..
– భిక్షపతి, 40వ డివిజన్

మేయర్: మీరు చెప్పిన సింగరేణి ఏరియాల్లోని కాలవలను సింగరేణికి సంబంధించిన పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. మున్సిపల్ పరిధిలో ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా నేనే స్వయంగా తనిఖీలు చేస్తున్న. నాసిరకంగా జరిగితే బిల్లులు చెల్లించేది లేదు. ఇంజినీర్లతో మరోసారి తనిఖీ చేయిస్తాను.

ప్రశ్న: మల్కాపూర్‌లో తాగునీటి సరఫరా తక్కువగా వస్తోంది.. – రమేశ్, మల్కాపూర్, 5వ డివిజన్

మేయర్: వెంటనే చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఇంజినీర్లను మీరు చెప్పిన ప్రాంతానికి పంపిస్తాను.

ప్రశ్న: కళ్యాణ్‌నగర్ రోడ్డులో మట్టికుప్పలు, రాళ్ల పేరుకుపోయాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి..
– బాల రాజ్‌కుమార్, కార్పొరేటర్, 42వ డివిజన్

మేయర్: వెంటనే చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తాను.

ప్రశ్న: విఠల్‌నగర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో ఎందుకు నిర్లక్ష్యం జరుగుతోంది..?
– మద్దెల దినేష్, సీపీఐ నాయకుడు

మేయర్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల వేగవంతానికి కాంట్రాక్టర్‌తో చర్చించాం. సీనియర్ సిటిజన్ హాల్ నిర్మాణంలోకి తెస్తాం. ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లోకి వ్యాపారులు రావడానికి అద్దె కూడా తగ్గించాం.

ప్రశ్న: శాంతినగర్‌లో యూజీడీకి చర్యలు తీసుకోండి..
– రామకృష్ణ, శాంతినగర్, 39వ డివిజన్

మేయర్: నేరుగా కలిసి ఒక దరఖాస్తు ఇవ్వండి. మీ ప్రాంతాన్ని ఇంజినీర్లు పరిశీలించి టెండర్లు పిలుస్తారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

కంటి వెలుగుపై చీకట్లు పడనీయొద్దు

- కలెక్టర్లతో మంత్రి హరీశ్‌రావు వీడియోకాన్ఫరెన్స్



మంత్రి హరీశ్‌రావు వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇతర అధికారులు

పెద్దపల్లిరూరల్: ఈనెల 18నుంచి మొదలయ్యే మలివిడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేలా జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కలెక్టర్లకు సూచించారు. గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వి, కమిషనర్ శ్వేతతో కలిసి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పొరపాట్లు దొర్లకుండా వైద్యబృందాలు అవసరమైతే సమీప పట్టణాలు, మండలకేంద్రాల్లో బస చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 34బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 29,255 అద్దాలు చేరాయని వివరించారు. 68ట్యాబులను సాఫ్ట్‌వేర్‌తో సిద్ధంచేశామని వివరించారు.

కంటి వెలుగు మహత్తర కార్యక్రమం : చందర్

కోల్‌సిటీ: కంటి వెలుగు మహత్తర నిర్ణయమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్లు, ఔషధాలు ఉచితంగా అందిస్తామన్నారు. మేయర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ కంటి వెలుగు కేంద్రాలలో ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తామన్నారు.కమిషనర్ సుమన్ రావు, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ కృపాబాయ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి



హైదరాబాద్ వెళ్తున్న రెండో ఏఎన్ఎంలు

సుల్తానాబాద్: జిల్లాలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్లేముందు విలేకరులతో మాట్లాడారు. పనిభారం తగ్గించాలని, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించాలని సూచించారు. 14 ఏళ్లుగా రెగ్యులర్ చేస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 16లో తమను చేర్చి రెగ్యులరైజ్ చేయడానికి అన్ని అర్హతలూ ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వరూప, వీణ, కోడూరి కవిత గౌడ్, రమాదేవి, రాజుభాయ్, రజిత, భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

'సదరం'పై చేతులెత్తేసిన ఏసీబీ..!

- సివిల్ ఆసుపత్రి కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల రాకెట్
- గతేడాది సుమోటోగా స్వీకరించిన ఏసీబీ
- ప్రశ్నావళికే పరిమితమైన అధికారులు
- అనుమానితులపై తూతూమంత్రపు విచారణ
- చివరికి ఏసీబీ విచారణను సైతం అడ్డుకున్న నిందితులు?

'317 జీవో అమలు సందర్భంగా వరంగల్ జిల్లాలో బదిలీని తప్పించుకునేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అప్పగించిన దాదాపు 40కిపైగా నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్లను గుర్తించారు. అందులో 10కిపైగా సర్టిఫికెట్లు కరీంనగర్ సివిల్ ఆసుపత్రి నుంచి జారీ అయినవే. అదే సమయంలో కరీంనగర్‌లోనూ పలు అనుమానాస్పద సర్టిఫికెట్లపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో వాటిని పక్కనపెట్టాలని స్వయంగా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ అనుమానాస్పద సర్టిఫికెట్లు సైతం కరీంనగర్ సివిల్ ఆసుపత్రి ఇచ్చినవే కావడం గమనార్హం'.


సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ సివిల్ ఆసుపత్రి కేంద్రంగా 'సాక్షి' బయటపెట్టిన అనర్హులకు సదరం సర్టిఫికెట్ల స్కామ్ వ్యవహారం ఎంత వేగంగా బయటికి వచ్చిందో.. ఇప్పుడు అంతే వేగంగా మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి 6న 'దివ్యంగా దోచేస్తున్నారు' శీర్షికన సివిల్ ఆసుపత్రిలో కొందరు వైద్యసిబ్బంది, తాత్కాలిక సిబ్బందితో కుమ్మక్కై అనర్హులకు దివ్యాంగ సర్టిఫికెట్లు కట్టబెడుతున్న వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. ఆ తరువాత వరుస కథనాలు వచ్చాయి. దీనికి తమకు సంబంధం లేదని చెప్పిన సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాల.. సదరు ఆరోపణలు వచ్చిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు శ్రీనివాస్, కిశోర్‌ను ఈ వ్యవహారానికి బాధ్యులుగా చేస్తూ విధుల నుంచి తప్పించారు. అప్పటికే డీఆర్‌డీఏ వీరిని తొలగించి రెండేళ్లు గడిచినా.. వీరు జీతం లేకుండా.. అనర్హులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తూ స్వేచ్ఛగా దందా కొనసాగించారు. అసలు ఏ వైకల్యంలేని వారికి సైతం 100 శాతం వైకల్యం జారీ చేసిన విధానం చూసి సివిల్ ఆసుపత్రి సిబ్బందే ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి సర్టిఫికెట్లను గతేడాది 'సాక్షి' ప్రచురించినా.. ఇప్పటికీ సదరం వెబ్‌సైట్‌లో అలాగే ఉంచడం గమనార్హం.

విచారణలన్నీ తుంగలోకే..!

'సాక్షి' కథనాలతో జిల్లా యంత్రాంగం తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి అడిషనల్ డీఆర్‌డీవో నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. వాస్తవానికి 2015 నుంచి ఉమ్మడి జిల్లా ఉన్నప్పటి నుంచి నకిలీ సర్టిఫికెట్ల దందా నడుస్తోందని ఆరోపణలు ఉన్నా.. కేవలం 2021 జనవరి నుంచి 2022 జనవరి వరకు జారీ అయిన సర్టిఫికెట్లపై మాత్రమే విచారణ జరిగింది. 16 మండలాల్లోనూ విచారణ జరిపిన అధికారులు నివేదికను కలెక్టర్‌కు పంపారు. కానీ, ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులు చక్రం తిప్పి దాన్ని వెలుగులోకి రానీయలేదు. అధికా రుల తీరుపై విమర్శలు రావడంతో మరోసారి మార్కెటింగ్ శాఖలోని ఓ ముఖ్య అధి కారితో విచారణ చేయించారు. తర్వాత మరో అధికారి కూడా ఇదే అంశంపై విచారించారు. ఈ ఇద్దరూ ఏం విచారణ చేశారో? ఏం నివేదిక ఇచ్చారో? ఎవరికీ తెలియదు. అంతకుముందు టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ చేశారు. సదరు సర్టిఫికెట్లపై సివిల్ ఆసుపత్రి కూడా విచారణకు ఓ వైద్యుడిని నియమించింది. ఎన్ని విచారణలు వేసినా ఇంత వరకూ వాస్తవాలు వెలుగుచూడలేదు.



కరీంనగర్ సివిల్ ఆసుపత్రి



100 శాతం వైకల్యం సర్టిఫికెట్

ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం..!

సదరం సర్టిఫికెట్ల జారీ వెనక రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. వీటిని వ్యాపారులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఇలా పలువురు అనేక రకాలుగా దుర్వి నియోగం చేస్తున్నారు. ఇలాంటి జాబితాలో సామాన్యులు కూడా ఉన్నారు. ఏ వైకల్యం లేకపోయినా.. చెవిటి, అంధ సర్టిఫికెట్లు తీసుకుని ప్రతినెలా ఠంచనుగా ఖాతాలో రూ.3,000 చొప్పున వికలాంగ పింఛన్ పొందుతున్నారు. ఇలాంటి జాబితాలో స్థానిక ప్రజాప్రతినిధుల బంధువులు అధికంగా ఉండటం గమనార్హం. పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు ఇన్‌కం ట్యాక్స్, బదిలీల్లో మినహాయింపు కోసం వీటిని వాడుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ లెక్కన నెలనెలా రూ.కోట్ల నష్టం ఖజానాకు చిల్లులు పడుతోంది. ఈ వ్యవహారంలో కనీసం ఏసీబీతోనైనా న్యాయం జరుగుతుందని భావించినా చివరికి నిరాశే మిగిలిందని సాక్షాత్తూ సివిల్ ఆసుపత్రి సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు.

ఏసీబీ ప్రవేశంతో మారిన సీన్..!

ఈ కేసులో సూత్రధారులకు రాజకీయ అండదండలు దండిగా ఉన్నాయి. దీంతో జిల్లా అధికారుల విచారణ నివేదికలను బయటికిరాకుండా తొక్కిపెట్టారు. కానీ.. ఏసీబీ సుమోటోగా కేసు స్వీకరించే సరికి అందరికీ చెమటలు పట్టాయి. ఏసీబీ విచారణ ప్రారంభించాక ఇటు డీఆర్‌డీవో, అటు సివిల్ ఆసుపత్రిలోని కిందిస్థాయి సిబ్బందిని పిలిపించి విచారించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులకు కీలక ప్రశ్నల జాబితా పంపించి సమాధానాలు సేకరించారు. ఆ తర్వాత విచారణ ఊపందుకుంటుందని అంతా అనుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారాన్ని సుమోటోగా పరిగణించి విచారణకు చేపట్టిన ఏసీబీ అ ధికారులు తొలుత దర్యాప్తును పరుగులు పెట్టించినా.. ఇప్పుడు ఎటూ కాకుండా స్తంభించిపోయింది. దీని వెనక కొందరి ఒత్తిళ్లే కా రణమని గుసగుసలు వస్తున్నాయి. మొత్తానికి అవినీతిపై వేసిన విచారణను పూర్తి చేయడంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) విఫలమైందన్న విమర్శలను మాత్రం మూటగట్టుకుంటోంది.

క్లుప్తంగా

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మానస


మానస

ధర్మారం(ధర్మపురి): ధర్మారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వనం మానస జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మానస ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎంపికై ంది. ఈ నెల 15వరకు రాజస్తాన్‌లోని దీద్వానలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. ఈసందర్భంగా మానసను ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్, డీవైఎస్‌ఓ రాజువీరు, మాజీ ఎంపీపీ పానుగోటి శ్రీనివాస్‌రావు తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న స్వప్న, తదితరులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. జిల్లా స్థాయిలో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న మనీషా (10వ తరగతి), ప్రణవి(8వ తరగతి) మొదటిస్థానంలో నిలిచారు. నిర్మల్ జిల్లాలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సోయిల్ మోయిచర్ అలారం, ఆటోమెటిక్ మోటార్, ఎర్త్‌క్వాక్ అలారంను ప్రదర్శించినట్లు స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్పెషల్ ఆఫీసర్, గైడ్ టీచర్ అంజలిదేవి అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లక్ష్మీబిందు


లక్ష్మీబిందును అభినందిస్తున్న ఎంఈవో

కమాన్‌పూర్(మంథని): నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 13,14 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు పెద్దపల్లి జిల్లా జట్టుకు కమాన్‌పూర్ జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లక్ష్మీబిందు ఎంపికై ట్లు ఎంఈవో సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. ఈ నెల 10న గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా లక్ష్మీబిందును గురువారం ఎంపీవో తదితరులు అభినందించారు.

అదనుచూసి హతమార్చింది

- నిత్యం తాగుడు.. వేధింపులు తాళలేక
- భర్తను హత్య చేసిన భార్య
- గడ్డపారతో కొట్టి దారుణం
- లంబాడితండాలో విషాదం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- బాలరక్ష భవన్‌కు పిల్లల తరలింపు


వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడ్డి


తండ్రిని కోల్పోయిన చిన్నారులు

ఓదెల(పెద్దపల్లి): భర్త తాగుడుకు బానిసై నిత్యం వేధించడంతో తట్టుకోలేని భార్య అతడిని హతమార్చింది. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లండాడితండా గ్రామానికి చెందిన గుగులోతు తేజనాయక్(32)ను గురువారం ఉదయం భార్య గుగులోతు కవిత గడ్డపారతో కొట్టి హత్యచేసింది. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పొత్కపల్లి ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన కవితకు లండాడితండాకు చెందిన గుగులోతు తేజనాయక్‌తో 2010లో వివాహమైంది. కూలీ పనులు చేసుకునే తేజనాయక్ తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగి భార్యతో గొడవపడటంతో పాటు వేధించేవాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం తేజనాయక్ తాగి ఇంటి ముందున్న చింతచెట్టు కింద పడుకున్నాడు. దీంతో అదనుచూసిన కవిత ఇంట్లోని గడ్డపారతో తేజనాయక్ ఎడమవైపు మెడపై పొడిచి, విచక్షణ రహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు గుగులోతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు పోలీ సులు తెలపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అతడి తల్లితండ్రులు ఇటీవలే మృతిచెందారు.


తేజనాయక్ మృతదేహం

నాన్నను నిద్ర లేపేలోపు అమ్మ చంపింది

'తాగి చెట్టుకింద పడుకున్న నాన్నను లేపుదామని వెళ్లేసరికి లేవలేదు. అమ్మ వచ్చి గడ్డపారతో కొట్టి చంపింది' అని మృతుడి కుమారుడు గుగులోతు మహేశ్(9), కూతురు మహదేవి(8), చిన్న కుమారుడు గిరేందర్(5) ఘటన స్థలంలో చెప్పి నతీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. 'నాన్నను కొట్టిన తర్వాత అమ్మ ఇంట్లోనుంచి పారిపోయింది. మేము ఊరి బడిలో చదువుకుంటున్నాం. రోజూ ఇంట్లో లొల్లి జరుగుతుంది' అని చిన్నారులు పేర్కొన్నారు.

పిల్లలను చూసి చలించిపోయిన సీఐ

లండాడితండాలో గుగులోతు తేజనాయక్ హత్య స్థలాన్ని సందర్శించిన సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి మృతుడి పిల్లలను చూసి చలించిపోయారు. వారికి బిస్కెట్లు తినిపించారు. వారికి నీళ్లు తాగించి జరిగిన ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు పిల్లలు

హత్యకు గురైన తేజనాయక్ పిల్లలు మహేశ్, మహదేవి, గిరేందర్‌లను పెద్దపల్లి బాలరక్ష భవన్‌కు తరలించాలని తండావాసులు సీఐ, ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. తేజనాయక్ అంత్యక్రియలు జరిగిన పిమ్మట తీసుకెళ్లాలని బాలరక్ష భవన్ కోఆర్డినేటర్‌కు సీఐ ఆదేశాలు జారీ చేశారు.

స్టేషన్‌లో లొంగిపోయిన నిందితురాలు

భర్త గుగులోతు తేజనాయక్‌ను హత్యచేసిన కవిత నేరుగా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. కవితపై హత్యకేసు నమోదు చేసి సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

డీపీఈ గైడ్‌లైన్స్ పక్కనబెట్టి వేతన ఒప్పందం


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారావు

గోదావరిఖని(రామగుండం): డీపీఈ గైడ్‌లైన్స్ పక్కన బెట్టి 11వ వేతన ఒప్పందాన్ని ఖరారు చేశామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు పేర్కొన్నారు. గురువారం జీడీకే-11వ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్, ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇది కార్మికుల విజయంగా పేర్కొన్నారు. ఒక పక్క బొగ్గు కొరత, మరో పక్క కార్మికులు పోరాటానికి సిద్ధం కావడం, గతనెల 9న కోల్ ఇండియా, సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయడంతో పాటు సమ్మెకు సన్నద్ధం కావడంతో యాజమాన్యం దిగివచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా 10ఏళ్ల వేతన ఒప్పందాలు జరుగుతున్న నేపథ్యంలో ఐదేళ్ల కాలానికి ఒప్పందం చేసుకోవడం మంచి పరిణామమని వివరించారు. వేతన ఒప్పందం మాదిరిగా మెడికల్ స్కీం, పెన్షన్, క్యాడర్ స్కీం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన ఐదు సబ్ కమిటీలు వేసి వాటి రిపోర్టులు వచ్చిన తర్వాత పూర్తి జేబీసీసీఐ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దీనికి ఇంకా రెండుమూడు నెలల గడువు పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, ఎస్.వెంకన్న, ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్పీలో జీఎంకు సన్మానం


సన్మానిస్తున్న జీఎం, తదితరులు

రామగిరి(మంథని): జనరల్ మేనేజర్ (భూగర్భ గనులు)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.జగన్‌మోహన్‌రావు(ఈఅండ్ఎం)ను గురువారం ఏపీఏ జీఎం ఎన్వీకే. శ్రీనివాస్ సన్మానించారు. ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును మొట్టమొదటి సారి సందర్శించిన సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగన్‌మోహన్‌రావును జీఎంతో పాటు ఇతర అధికారులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు సంబధిత అధికారులతో ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించారు. ఏరియా ఇంజినీర్ బి.సీతారామం, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, భూగర్భ గనుల డీజీఎం(కార్పొరేట్) బి.చక్రవర్తి, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురాం, ఎస్ఓఎం జనార్ధన్, ఫిట్ ఇంజినీర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలోనే ఈఎస్ఐ స్థలం ఖరారు చేయండి


మంత్రి మల్లారెడ్డితో ఎమ్మెల్యే చందర్

రామగుండం: పట్టణంలోని గురుకుల విద్యాలయం రహదారి మార్గంలో పట్టణ ప్రకృతివనం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని ఖరారు చేయాలని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ మంత్రితో సమావేశమయ్యారు. సదరు స్థలం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనువుగా ఉంటుందని ఏడాది క్రితం మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసిన పత్రాలను మంత్రికి అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి అప్పటికప్పుడు ఈఎస్ఐ ఈడీతో ఫోన్‌లో మాట్లాడి రామగుండంలో పరిశీలించిన ఈఎస్ఐ స్థల వివరాలపై నాలుగు రోజుల్లోగా నివేదికను అందజేయాలని ఆదేశించారు. నివేదిక అందిన వారం తర్వాత మరోమారు చర్చించి స్థలాన్ని ఖరారు చేయనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వేతన ఒప్పందం ఖరారులో బీఎంఎస్ కీలకపాత్ర


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): 11వ వేతన ఒప్పందం ఖరారులో బీఎంఎస్ కీలకపాత్ర పోషిస్తోందని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం ఆర్జీ- 1 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 19శాతం కనీస వేతన పెరుగుదల చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. యూనియన్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా మెరుగైన వేతనం ఒప్పందం సాధించామన్నారు. బీఎంఎస్‌తో మిగిలి మూడు జాతీయ సంఘాలను కలుపుకొని సమ్మెకు సిద్ధమవుతున్న క్రమంలో కోలిండియా యాజమాన్యం దిగివచ్చి వేతన ఒప్పందానికి ఒప్పుకుందన్నారు. గనుల పైన పోరుదీక్ష పేరుతో శాసనసభ్యులు కార్యక్రమాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పట్టణంలో సమస్యలు పరిష్కరించడానికి బస్తీబాటలు కొనసాగించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆకుల హరీష్, మాదాసు రవీందర్, గాజుల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదానికి కారణమేంటి..?

- రూ.1.60కోట్ల మేర ఆస్తినష్టం
- వివరాలివ్వాలని కోరిన ఫైర్ అధికారులు


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులోని ఎస్సార్ఆర్ టపాకాయల గోదాములో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరగడానికి ప్రధాన కారణమేంటన్నది ఇప్పటికీ తేలలేదు. టపాకాయలను నిల్వ ఉంచే గోదాములకు కరెంట్ సరఫరా ఉండదు. కాబట్టి షార్ట్‌సర్క్యూట్ కారణం కాదు. మరి ప్రమాదం ఎలా జరిగి ఉంటుందనే విషయం ఎవరికీ అంతుబట్టడం లేదు. కాగా అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం వ్యాపారి ఇల్లందుల కృష్ణమూర్తి చెప్పిన సమాచారం ప్రకారం 20రోజులకు పైగా గోదాం షెటర్ మూసి ఉంచడంతో (స్పాంటానియస్ కాంబుషన్) అప్రయత్నపూర్వక ప్రమాదంగా పేర్కొంటున్నారు. బుధవారం రాత్రి గోదాములో అంటుకున్న మంటలను గురువారం తెల్లవారుజామున మూడుగంటల వరకు మూడు ఫైరింజన్లతో పాటు గోదాముల వద్ద అమర్చిన పరికరాల సాయంతో ఆర్పామని పెద్దపల్లి అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మంటలు ఆర్పే పనులను జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఖాజా కరీముల్లా పర్యవేక్షించారు. గోదావరిఖని, మంథని అగ్నిమాపకశాఖ అధికారులు సత్యనారాయణ, సదానందం తమవంతుగా సహకారం అందించారు. టపాసుల వ్యాపారి కృష్ణమూర్తి దాదాపు రూ.కోటి 60లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారని, అందుకు తగ్గ వివరాలు ఇవ్వాలని కోరామని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు.

కార్మిక భవిష్యత్తుకు మరో ఉద్యమం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల భవిష్యత్ కోసం తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తరహాలో బొగ్గు బ్లాకుల పరిరక్షణకు మరో ఉద్యమం చేపడుతామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. గురువారం జీడీకే- 2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి అస్థిత్వాన్ని రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన విధానాలకు పూనుకుంటోందన్నారు. సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలు, జాతీయ పార్టీలు పోగొట్టిన వారసత్వ హక్కులను తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సాధించిపెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండీఆర్ -15ను వెంటనే రద్దుచేయాలని, తెలంగాణలోని వనరులను తెలంగాణకే వర్తించేలా సర్క్యులర్ జారీ చేసేవరకు తన పోరాటం ఆగదన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరు దీక్ష చేపట్టానని, అంతటితో ఆగకుండా గనులపై బాయిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నానన్నారు. కార్మికులు, ప్రజలందరూ పార్టీలకతీతంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పలువురు కార్మికులకు టీబీజీకేఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు గంధ్ర దామోదర్‌రావు, జాహిద్‌పాషా, మంద రమేష్, వడ్డేపల్లి శంకర్, పుట్ట రమేష్, తోట శేషగిరి, దేవ వెంకటేశం, దొరగండ్ల మల్లయ్య, అయిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శ్రీనివాస్ (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ధర్మారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో దైత శ్రీనివాస్(62) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. కన్నాల బస్టాండ్ సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపై బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారానికి వెళ్లే రైల్వేలైన్ గేట్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా దారిని కన్నాల భారత్ పెట్రోల్ బంక్ నుంచి ధర్మారం క్రాస్‌రోడ్డు వరకు వన్‌వే చేశారు. ఈక్రమంలో సుల్తానాబాద్‌లోని దత్తాత్రేయ రైస్‌మిల్లు యజమాని దైత శ్రీనివాస్ సొంత పని మీద ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా ఎదురుగా గోదావరిఖని నుంచి బొగ్గులోడుతో వస్తున్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో రహదారికి ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుల్తానాబాద్‌లో విషాదం

సుల్తానాబాద్(పెద్దపల్లి): దైత శ్రీనివాస్ మృతితో సుల్తానాబాద్‌లో విషాదం నెలకొంది. రైస్‌మిల్ భాగస్వామి కావడంతో పాటు వివాదరహితుడిగా శ్రీనివాస్‌కు స్వప్నకాలనీలో మంచి పేరు ఉందని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పలు రైస్‌మిల్లుల యజమానులు హుటాహుటిన పెద్దపల్లి ఆసుపత్రికి తరలివెళ్లారు. సహచరుడు ప్ర మాదంలో మృతిచెందడం కలిచివేసిందని పలు వురు వ్యాపారులు రోదించారు. రైస్‌మిల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సీటి కేశవరావు, మాజీ ఉ పాధ్యక్షులు అల్లంకి శ్రీనివాస్, కరుణాకర్, యజ మానులు శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరావు, వేణు, కృష్ణ, సురేష్, తిరుపతి బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

శ్వాస అందక యువకుడు మృతి


హరికృష్ణ(ఫైల్)

కరీంనగర్‌రూరల్: విద్యుత్ మోటారు మరమ్మత్తు కోసం వ్యవసాయ బావిలో దిగిన ఓ యువకుడు పైకి వచ్చేక్రమంలో శ్వాస అందక మృతిచెందిన ఘటన రైతు కుటుంబంలో విషాదం నింపింది. కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం.. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన ఎర్ర హరికృష్ణ(31) విద్యుత్ మోటారు చెడిపోవడంతో మరమ్మతు కోసం మెకానిక్ చందుతో కలిసి గురువారం వ్యవసాయ బావిలో దిగాడు. పైపు వేసి బావిపైకి వచ్చే క్రమంలో శ్వాస అందడం లేదంటూ విద్యుత్ మోటారు ఫౌండేషన్ చోట కుప్పకూలిపోయాడు. వెంటనే సమీపంలోని రైతులు ఎర్ర మల్లయ్య, ఏసురెడ్డిలు హరికృష్ణను చికిత్సకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరికృష్ణకు గతంలో ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగిందని, బావిలో నుంచి పైకి వస్తుండగా శ్వాస అందక మృతిచెందినట్లు తల్లి సరోజన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈపీ ఆపరేటర్లకు పదోన్నతులు కరువు


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రియాజ్‌అహ్మద్

గోదావరిఖని(రామగుండం): బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తోన్న ఈపీ ఆపరేటర్లకు పదోన్నతులు కరువయ్యాయని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. గురువారం ఓసీపీ- 3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులను అధికారులు వేధిస్తే ఊరుకునేది లేదన్నారు. డ్రిల్ ఆపరేటర్లకు శిక్షణ కాలాన్ని తగ్గించాలన్నారు. అసిస్టెంట్ చైన్‌మెన్ పోస్టులు, పంప్‌ఆపరేటర్ పోస్టులు లేవన్నారు. గ్రీజ్‌హెల్పర్, కేబుల్‌బాయ్, ఫోర్‌మెన్, ల్యాంపురూం పోస్టులు కరువయ్యాయని వాపోయారు. యాక్టింగ్ కార్మికులకు పదోన్నతి ద్వారా పోస్టులు ఇవ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో సింగరేణిలో హెచ్ఎంఎస్‌ను గెలిపించి కార్మిక హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, ఇటీవల గోదావరినదిలో దూకిన తల్లి, ఇద్దరు పిల్లలను కాపాడిన సింగరేణి కార్మికుడు శ్రీనివాస్‌ను సన్మానించారు. నాయకులు దావు రమేష్, ఆరే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు


మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామమైన ఆర్జీ-2 ఏరియా న్యూమారేడుపాకలో సింగరేణి ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆర్జీ-2 జీఎం మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మెడికల్ సూపరింటిండెంట్ అనిల్‌కుమార్, డివిజన్ కార్పొరేటర్ అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌పై కేసు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన బాధితురాలి ఫిర్యాదు మేరకు సింగరేణి వైద్యుడు విశ్వమేధపై గురువారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మానసిక వైద్యుడు విశ్వమేధ కొంతకాలంగా కాలనీకి చెందిన మహిళతో సన్నిహితంగా ఉంటూ వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..


ట్రినిటి ఉన్నత పాఠశాలలో..

ముందస్తు సంక్రాంతి సంబరాలు

సంబరాల సంక్రాంతి మూడు రోజుల ముచ్చటైన పండగ వేడుకలను ముందస్తుగా జరుపుకున్నారు విద్యార్థులు. పండగ విశిష్టత ఉట్టిపడేలా రంగవల్లులు వేస్తూ భోగిమంటలు వేసి ఆడిపాడారు. పతంగులతో పిల్లలు ఆడుతూ కనిపించారు. పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సంక్రాంతి వేడుకల్లో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి